క్లుప్తంగా

రేపటి నుంచి వేడుకలు
బాలానగర్: మండల కేంద్రంలో మంగళవారం నుంచి 18 వరకు బొడ్రాయి పండుగ నిర్వహించనున్నట్లు సర్పంచ్ విజయలక్ష్మి తెలిపారు. వేడుకల్లో బంధుమిత్రులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత
మిడ్జిల్: వాడ్యాల్‌కి చెందిన ప్యాట చంద్రమౌళి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామ కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్, భీరయ్య ఆదివారం బాధిత కుటుంబానికి రూ. పది వేలు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు వెంకటేష్‌గౌడ్, మల్లయ్య, జంగయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
కోయిల్‌కొండ: మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు పేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సోమవారం రానున్నట్లు ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. దమాయపల్లి–గార్లపహాడ్, తిర్మలంపల్లి–గార్లపహాడ్ బీటీ రోడ్ల రెన్యూవల్ పనులు, కేశ్వాపూర్ హెల్త్‌సెంటర్, పారుపల్లి పంచాయితీ భవనం, శేరివెంకటాపూర్ ఆరోగ్యకేంద్రం, అంకిళ్ల హెల్త్‌సబ్ సెంటర్ భవనాల శంకుస్థాపన తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. అనంతరం కోయిల్‌కొండలో మండలస్థాయి సీఎంకప్ పోటీలు ప్రారంభిస్తారని వివరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


జడ్చర్ల టౌన్: శంకరాయపల్లితండా బొంగరాల గుట్ట వద్ద నిర్మించిన ఆలయంలో తుల్జాభవాని విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. మూడురోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో చివరి రోజు చండిహోమం పూర్ణాహుతి సమర్పించారు. ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి పూజలో పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ
మిడ్జిల్: దోనూర్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం చేపట్టారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ సుదర్శన్, సర్పంచ్‌లు సరిత, జంగారెడ్డి, మధుసుధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు ప్రారంభం
చిన్నచింతకుంట: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దమగ్నాపురం గ్రామానికి రూ. 90 లక్షల నిధులతో బీటీ రోడ్డును ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ మెంబర్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుర్వపల్లికి మట్టిరోడ్డు
రాజాపూర్: ఈద్గాన్‌పల్లి నుంచి కుర్వపల్లికి బీజేపీ నాయకురాలు బాలత్రిపుర సుందరిదేవి తన సొంత ఖర్చులతో మట్టిరోడ్డును ఆదివారం వేయించారు. ఎన్నో ఏళ్లుగా రెండుగ్రామాల మధ్య రవాణ సౌకర్యం చాలా ఇబ్బందిగా ఉండటంతో సమస్యను తెలుసుకుని చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆమెకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు వెంకట్‌రాంరెడ్డి, రామకృష్ణ, ఆదిత్య, నరేష్ పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక శిక్షణ
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ బీఈడీ కళాశాలలో విద్యార్థులకు విద్య వైజ్ఞానిక శిక్షణ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ
పాలమూరు: జిల్లా కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో ఆదివారం మధ్యాహ్నం భారీ లారీ తగిలి విద్యుత్ తీగ తెగిపోయింది. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కుర్మయ్య విషయం గమనించి తీగను కట్టె సహాయంతో పక్కకు తొలగించారు. అటువైపు వాహనాలు, పాదచారులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ తర్వాత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి మరమ్మతు చేయించారు.

ముగిసిన నాటక ప్రదర్శన
మరికల్: పెద్దచింతకుంటలో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మంగారి నాటక ప్రదర్శన శనివారం అర్ధరాత్రి ముగిసింది. చివరి రోజు బ్రహ్మంగారి సమాధి సన్నివేశాలను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు గ్రామ పెద్దలు అభినందించారు.



అధ్వానంగా బీటీ రోడ్లు

- స్తంభాలకు సుడులు తిరిగిన తీగలు
- డంపింగ్ యార్డుగా మారిన పాత పోస్టుమార్టం స్థలం
- సమస్యలతో సతమతమవుతున్న స్థానికులు

వార్డ్ వాచ్

19వ వార్డులో జనాభా: 5,899
ప్రధాన వీధులు: షాషాబ్‌గుట్ట (కొంత భాగం), నలంద ఆటోస్టాండ్, జగదాంబకాలనీ, షాషాబ్‌గుట్టతండా



పాత పోస్టుమార్టం స్థలంలో పేరుకుపోయిన చెత్త



గుంతల మయంగా బీపీపీ కాంప్లెక్స్ నుంచి ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే దారి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 19వ వార్డు పరిధిలోని ప్రధాన వీధుల్లో బీటీరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. షాషాబ్‌గుట్ట రోడ్డు నుంచి నలందా ఆటోస్టాండ్, కమలానెహ్రూ పార్కు ఎదురు గల్లీ నుంచి పాత పోస్టుమార్టం మీదుగా షాషాబ్‌గుట్ట తండా వరకు ఎక్కడికక్కడ బీటీ దెబ్బతింది. బీపీపీ కాంప్లెక్స్ మొదలుకొని ఆంజనేయస్వామి ఆలయం మీదుగా షాషాబ్‌గుట్టచౌరస్తా వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. దాదాపు అన్ని గల్లీల్లోని అన్ని లోతట్టు ప్రాంత డ్రెయినేజీల్లో మురుగు పేరుకుపోయింది. కాగా పారిశుద్ధ్య కార్మికులు సరిగా రావడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జగదాంబకాలనీలో నీటి పంపునకు ఎదురుగా, సమీపంలోని రెండు విద్యుత్ స్తంభాలకు 30



జీజీహెచ్ వెనుక భాగంలో..

నుంచి 40 వరకు సర్వీసు వైర్లు, టీవీ కేబుళ్లు చుట్టేశారు. దీంతో వర్షా కాలంలో గాలికి తీగలు ఒకదానికొకటి తగిలి షార్ట్‌సర్క్యూట్ అయి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా డ్రెయిజీనీ శుభ్రం చేసిన రెండు మూడు రోజుల తర్వాతే చెత్తను తీసుకెళ్తున్నారని వాపోయారు. గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) వెనుక నుంచి వెళ్లే పెద్దనాలాపై అక్కడక్కడా పైకప్పు లేకపోవడంతో వర్షపునీరు, మురుగు బయటకు వచ్చి గల్లీ రోడ్లపై నడవడానికి వీలులేకుండా మారుతోందంటున్నారు. పాత పోస్టుమార్టం భవనాన్ని రెండేళ్ల క్రితం కూల్చివేసి వృథాగా వదిలేశారని దీంతో చుట్టుపక్కలవారు దానిని డంపింగ్ యార్డుగా మార్చేశారని చెబుతున్నారు. అప్పట్లోనే పార్కుగా మారుస్తామన్న పాలకులు, అధికారుల మాటలు నీటి మూటలు అయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాంప్లెక్స్ కాంపౌండ్‌కు ఆనుకుని సుమారు 25 మాంసం దుకాణాలు ఉన్నాయని విక్రయదారులు పడేసే వ్యర్థాలతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారిందని ప్రజలు అంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వ న్యూటౌన్ హైస్కూల్ వెనుక కూరగాయల మార్కెట్ చుట్టుపక్కల అపరిశుభ్రంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వెంటనే మరమ్మతు చేయించాలి..
వార్డు పరిధిలోని ప్రధాన బీటీరోడ్లు గుంతలమయంగా మారాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని వెంటనే మరమ్మతు చేయించాలి. అదేవిధంగా గల్లీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. పారిశుద్ధ్య కార్మికులు సరిగా వచ్చేలా చేయాలి. అదేవిధంగా పాత పోస్టుమార్టం స్థలాన్ని పార్కుగా మారిస్తే బాగుంటుంది. అక్కడ చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది.
– ఖాజా మొయినొద్దీన్, షాషాబ్‌గుట్టతండా

రూ.75 లక్షలతో పనులు చేశాం..
మూడేళ్లలో సుమారు రూ.75 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. వార్డులోని బీటీరోడ్లు చాలావరకు దెబ్బతిన్నది వాస్తవమే. ఇక నుంచి వాటి స్థానంలో సీసీరోడ్లు మాత్రమే నిర్మిస్తాం. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను రహదారులు, డ్రెయినేజీలు, ఇతర పనులకు వెచ్చిస్తాం. పాత పోస్టుమార్టం స్థలంలో పార్కు ఏర్పాటుకు వైద్యశాఖ నుంచి ఎన్‌ఓసీ రావాల్సి ఉంది. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్, 19వ వార్డు

సీఎం కప్ నిర్వహణకు సమాయత్తం

మహబూబ్‌నగర్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్–2023 క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టగా.. గ్రామాల్లో సందడి నెలకొంది. పోటీలు విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది.

ఈనెల 16, 17వ తేదీల్లో పోటీలు మండల స్థాయిలో సాగనున్నాయి. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి అక్కడి నుంచి రాష్ట్ర స్థాయికి పంపే అవకాశం ఉంటుంది. పోటీల నిర్వహణకు మండల స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీఓ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ లేదా గజిటెడ్ హెచ్‌ఎం, ఎస్ఐ, పీఈటీలు సభ్యులుగా ఉంటారు.

జిల్లా కేంద్రంలోని స్టేడియంలో పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే మండల కమిటీ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి ఒక టీమ్ పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. 15–36 ఏళ్లలోపు వారు అర్హులుగా నిర్ణయించారు. ఆసక్తి ఉన్న మండలంలోని క్రీడాకారులు ఈనెల 15 మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా క్రీడా యువజన కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..
గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోటీలను నిర్వహించడం సంతోషకరం. వీటి ద్వారా గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించే అవకాశం ఏర్పడింది. అంతేకాకుండా గొప్ప క్రీడాకారులను గుర్తించి వెలుగులోకి తెచ్చే అవకాశం ఉంది.
– సుధాశ్రీ, ఎంపీపీ, టోర్నీ చైర్మన్

ఘనంగా హనుమాన్ జయంతి



గాధిర్యాల్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్ : మండలంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం గ్రామగ్రామాన ఘనంగా జరిగాయి. ఆలయాల్లో సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటకదిరలో రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ మల్లు రమ్యలు ప్రత్యేక పూజలు చేశారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం పరిమళగిరిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి నిర్వహించారు. పరశురామ పురోహిత సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం నిర్వహించారు. డాక్టర్ కుప్ప వెంకట జనార్దనశర్మ సుందరకాండ, డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి హనుమత్ చరిత్రపై ప్రవచనం చేశారు. ప్రధాన అర్చకులు భీమాచారి, జగన్నాథశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: సూరారంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హోమం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

నవాబుపేట: యన్మన్‌గండ్లలో ఆంజనేయస్వామికి విగ్రహానికి ఆదివారం హన్వాడకు చెందిన సులోచన, నాంరజీ, మహబూబ్‌నగర్‌కు చెందిన సరళ, శ్రీనివాస్, పుష్పలత, భాస్కరాచారీ వెండి ఆభరణాలు తయారు చేయించి ప్రధాన అర్చకులు ప్రాణేష్ శర్మకు అందించారు.



కోటకదిరలో పూజలు చేస్తున్న మల్లు దేవేందర్‌రెడ్డి, మల్లు రమ్య

మహమ్మదాబాద్: గాధిర్యాల్‌లో రెండోరోజు హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రథోత్సవం చేపట్టారు. ఉదయం 11గంటలకు స్వామివారి అభిషేకం, ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం పల్లకీసేవ, బొడ్రాయికి బోనాలతో ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్వేష రాజకీయాలకు కర్ణాటక ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు లాంటివని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్ రాజకీయాల్లో తెలంగాణ గడ్డపై బీజేపీకి తావులేదని స్పష్టం చేశారు. డబ్బు, మద్యం వెదజల్లినా, మతం సెంటిమెంట్ రాజేసినా, సాక్షాత్తు ప్రధాని 20 సార్లు పర్యటించినా కర్ణాటక ప్రజలు ఆదరించలేదని తెలిపారు. బీజేపీ అధికారం కోసం అనేక రాష్ట్రాల్లో రాజకీయ, రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చిందని విమర్శించారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ మనువాదాన్ని అమలుచేస్తున్న వారి విషయంలో దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. రాష్ట్రంలో లౌకికభావాలు కలిగిన బీఆర్‌ఎస్ మరోసారి అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ



అడ్డాకుల: బలీదుపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠను ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, డీఎస్పీ బంటు కిషన్‌లు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

రాజాపూర్ : ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రాఘవాపూర్‌లో రేణుకాదేవి జ్ఞాపకార్థం ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి కుటుంబ సభ్యులు నిర్మించిన నూతన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సుశీల, నాయకులు బచ్చిరెడ్డి, సత్యయ్య, సర్పంచ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రకు సన్నాహాలు

నవాబుపేట: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర మంగళవారం మండలంలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆదివారం తెలిపారు. కేశవరావుపల్లి పరిధిలోని కిలాట్‌నగర్‌లో భట్టి పాదయాత్ర రంగారెడ్డి జిల్లా నుంచి మండలంలో అడుగు పెట్టనుంది. జడ్చర్ల నియోజకవర్గంలో మూడు రోజులు యాత్ర కొనసాగనుంది. 16న కేశవరావుపల్లి, కొల్లూర్, వెంకటేశ్వరతాండ, 17న జంగమయ్యపల్లి, అమ్మపూర్, గురుకుంట , నవాబుపేట, యన్మన్‌గండ్ల, రుక్కంపల్లి, మల్లరెడ్డిపల్లి, 18న కూచూర్, దొడ్డిపల్లి, కిష్టారంలో పాదయాత్ర సాగనుందని పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్, డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న నిరసన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన సర్వే నం .247, 250లో కొందరు వ్యక్తులు అక్రమంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారని దళిత ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆరోపించారు. ప్రస్తుతం ఇక్కడ ఓ వ్యక్తి సుమారు 200 గజాల స్థలంలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం కూల్చివేయాలంటూ ఈనెల 13 నుంచి సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. రెండో రోజు ఆదివారం శిబిరంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కావలి కృష్ణయ్య మాట్లాడుతూ ఈపాటికే ఇళ్లు నిర్మించుకున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. నాయకులు పి.బాలయ్య, బేగా వెంకటస్వామి, సామేల్, ఎస్.బాలరాజ్, శ్రీరాములు, బండారు రాములు, రఘునాథ్, రాజారాం , శ్రీనివాసులు, కొండయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బ్లాక్‌బెల్టు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: అప్పన్నపల్లి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆదివారం జీకే షోటోకాన్ కరాటే డూ ఇండియా మాస్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బ్లాక్ బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.కృష్ణయ్య, చైర్మన్ రవికుమార్ ఎగ్జామినర్లుగా వ్యవహరించారు. పరీక్షల్లో ఐశ్వర, ఎస్.హరిణి, అభినవ్, జయవంత్, నవతేజ, నిశాంత్, వినయ్‌కుమార్, రామ్‌చరణ్, సాయినందు, భూపేష్, తిమ్మప్ప, ఎల్.శ్రవణ్, గౌతమ్ బ్లాక్‌బెల్టులు సాధించారు. ఉపాధ్యాయుడు రాజేందర్, కౌన్సిలర్ రామాంజనేయులు, జీకే షోటోకాన్ కరాటే జిల్లా అధ్యక్షుడు శివకుమార్, పట్టణ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో స్వీయరక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ కన్వీనర్ మోసిన్‌ఖాన్, కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అక్తర్ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో వేసవి 25వ ఉచిత కరాటే శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు యోగా శిక్షణ అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మోసీన్‌ఖాన్, జహీర్ అక్తర్ మాట్లాడారు. జహంగీర్‌పాష ఖాద్రీని అభినందించారు. వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

అడ్డాకుల: మూసాపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం (2001–02) ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులు విశ్వనాథ్, శేషయ్య, కృష్ణయ్య, శ్రీరాములు, శివరాములు, జనార్దన్, గాయత్రి, సంగీత, వాసిమ్‌బేగంలను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు తాము చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని నిర్ణయించుకుని మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చారు. పాండు, చెన్నకేశవులు, కుర్మత్‌రెడ్డి, బాలరాజు, ప్రహ్లాద్, రెడ్డిరాజు, తారకమ్మ, నిర్మల పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, కౌన్సిలర్ బాలలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

స్టేషన్ మహబూబ్‌నగర్: కల్వరి ఎంబీ చర్చి కార్యవర్గ ఎన్నికలు శనివారం నిర్వహించగా బీఐ జాకబ్ ప్యానల్ విజయం సాధించింది. చర్చి వైస్ చైర్మన్‌గా బీఐ జాకబ్, కార్యదర్శిగా జేఐ డేవిడ్, కోశాధికారిగా టీపీ స్టీవెన్, అసిస్టెంట్ కార్యదర్శిగా కేఎస్.ఇమ్మానుయేల్‌రాజ్, అసిస్టెంట్ కోశాధికారిగా ఎ.టైటస్, డీకన్స్‌గా బీఏ.విక్టర్, దాసరి సుందర్, ఎస్‌బీ.అబ్రహం, జోసెఫ్ సతీష్‌కుమార్, ఎల్.రవికుమార్, కేఏ.శ్యాంకుమార్, కేఆర్ ఫిలిప్, బీఏ.ప్రదీప్‌కుమార్, ఎల్డర్స్‌గా పానుగంటి సామ్యేల్, కేఎస్.ప్రేమ్‌రాజ్, ఆడిటర్స్‌గా తూపిలి మారడోనా, జోసెఫ్ రావ్‌లిన్, డీజే.రాజు ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఆర్ఎస్.డేవిడ్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. చైర్మన్ వరప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎట్టకేలకు బీటీ రోడ్డు పూర్తి

బాలానగర్: మండల కేంద్రంలో రూ. కోటితో చేపట్టిన బీటీ రోడ్డు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. నాలుగేళ్ల క్రితం మంజూరైన పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో సదరు కాంట్రాక్టర్ పనులు పూర్తిచేశారు. మండల కేంద్రంలోని సంత బజార్ అక్కడి నుంచి రైల్వే ట్రాక్, బైపాస్ మీదుగా ఎన్‌హెచ్–44 వరకు పూర్తి కావడంతో వాహనదారులతో పాటు, ప్రజలకు, వ్యాపారులకు దుమ్ముధూళి నుంచి విముక్తి లభించినట్టైంది. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మండల కేంద్రంలోని సంత బజారులో బీటీరోడ్డు

అమ్మ పలకరింపుతోనే ప్రశాంతత



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ పరంజ్యోతి

భూత్పూర్/దేవరకద్ర: రాజకీయంగా ఎంతగానో ఒత్తిడి ఉన్నా ఇంటికి వచ్చినప్పుడు అమ్మ పలకరింపుతో ప్రశాంతత కలుగుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అన్నాసాగర్‌లోని స్వగృహంలో ఆదివారం మదర్స్ డే సందర్భంగా తన తల్లి వరలక్ష్మి ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గంలోని మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెమా వర్షిప్ సెంటర్‌లో ఆదివారం మదర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ బీఎస్ పరంజ్యోతి మాట్లాడుతూ లోకంలో తల్లి ప్రేమ వెలకట్టలేనిదని అన్నారు. అనంతరం మాతృమూర్తులకు బహుమతులు అందజేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జడ్చర్ల టౌన్: మాతృదినోత్సవం పురస్కరించుకుని ఆదివారం మండలకేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మసేవాసమితి ఆధ్వర్యంలో బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇదే రోజు జన్మించిన ఆడపిల్ల తల్లికి రూ.5వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డా. సూర్య, సేవాసమితి నిర్వాహకురాలు పడాల రేణుక పాల్గొన్నారు. మన సేవాసమితి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఉమెన్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృమూర్తులను సత్కరించారు.



మాతృమూర్తితో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

విద్యార్థుల్లో ప్రజ్ఞ వికసించాలి

వనపర్తిటౌన్: విద్యార్థుల్లో ప్రజ్ఞ వికసించాలని వికాస తరంగిణి వీటీ కార్యకర్త శ్రీనివాస రామానుజదాస అన్నారు. ఆదివారం వేంకటేశ్వర ఆలయంలో 15ఏళ్ల లోపు పిల్లలకు ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వ్యక్తిత్వం, నైతిక విలువలను పెంపొందించడం ద్వారా మానవీయమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థుల్లో ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రజ్ఞ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.